క్లుప్తంగా

నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు



పెట్రోల్ నాణ్యతను పరిశీలిస్తున్న శివ బాలాజీ, అనంతరావు

రాజమహేంద్రవరం సిటీ: పెట్రోలు బంకుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివ బాలాజీ హెచ్చరించారు. ప్రపంచ లీగల్ మెట్రాలజీ వారోత్సవాల్లో భాగంగా శనివారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు పెట్రోల్ బంక్ వద్ద వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు పెట్రోలు నాణ్యత, పరిమాణం సరిచూసుకోవాలని సూచించారు. ఫిర్యాదులేమైనా ఉంటే 1967కు తెలపాలన్నారు. ప్రతి పెట్రోలు బంకులో తాగునీరు, మరుగుదొడ్లు, గాలి, ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉచితంగా అందించాలన్నారు. అనంతరం అధికారులు బంకులో తనిఖీలు చేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు

కడియం: మండలంలోని ప్రతి ప్రార్థనా మందిరం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఇన్‌స్పెక్టర్ అల్లు వేంకటేశ్వరరావు సూచించారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులతో స్థానిక మోడీ మందిరంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణ, దర్యాప్తులో సీసీ కెమెరాలు ఎంతో కీలకమన్నారు. అలాగే మందిరాలపై దాడులు జరిగితే నేరస్తులను గుర్తించేందుకు కూడా తోడ్పడతాయన్నారు. ఎస్‌ఐ ధనలక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పోలీసులకు తెలియజేస్తే, తగు సహాయం అందిస్తామన్నారు. సమావేశంలో ఫెలోషిప్ నాయకులు కరుణాకర్, పరంజ్యోతి, జయశీల్, మోడీ, సాలోమోను, జీవరత్నం, సాల్మన్‌రాజు, రత్నదీప్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిల్డ్రన్స్ థియేటర్ ఫెస్ట్



కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ కేతన్ గార్గ్

ప్రకాశం నగర్: లారెల్ హై గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఆనం కళా కేంద్రంలో చిల్డ్రన్స్ థియేటర్ ఫెస్ట్ ఫానోరామా ఆఫ్ ఇంగ్లిష్ ప్లేస్ కార్యక్రమం ఘనంగా జరిగింది. దీనికి నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ముఖ్య అతిథిగా హాజరై, చిన్నారులు ప్రదర్శించిన నాటకాలను తిలకించారు. అనంతరం మాట్లాడుతూ చిన్నారుల్లో కళా నైపుణ్యాలను వెలికి తీయడంలో థియేటర్ ప్రోగ్రామ్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. స్కూల్ డైరెక్టర్ సుంకర రవికుమార్ మాట్లాడుతూ కళ, సాహిత్యం, నాటకం వంటివి పిల్లల్లో ఆత్మ విశ్వాసం పెంపొందిస్తాయన్నారు. ఈ థియేటర్ ఫెస్ట్‌కు వాల్టర్ పీటర్ దర్శకత్వం వహించగా, పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: శుభం
సూర్యమినీ	: ఫైనల్ డెస్టినేషన్
సూర్యప్యాలెస్	: మిషన్ ఇంపాజిబుల్
స్వామి	: మిషన్ ఇంపాజిబుల్
శివజ్యోతి	: హిట్-3
అనుశ్రీ	: ఫైనల్ డెస్టినేషన్
రాజా	: ఫైనల్ డెస్టినేషన్
ఊర్వశి	: లవ్‌లీ
మేనక	: ఎలెవన్
రంభ	: 23
కుమారి	: మిషన్ ఇంపాజిబుల్
అప్సర	: సింగిల్
అశోక నామవరం	: ఫైనల్ డెస్టినేషన్
వీఎస్ మహల్ ధవళేశ్వరం	: మిషన్ ఇంపాజిబుల్
మురళీకృష్ణ కడియం	: మిషన్ ఇంపాజిబుల్, సింగిల్
వెంకటసూర్య	: మిషన్ ఇంపాజిబుల్

సెలవుల్లో చూసేద్దాం..

- ప్రత్యేక ఆకర్షణగా కాటన్ మ్యూజియం
- తరలివస్తున్న విద్యార్థులు
- వేసవి సెలవుల నేపథ్యంలో రద్దీ



కాటన్ మ్యూజియం



గోదావరి నది ప్రవాహ నమూనా



ఆనకట్ట నిర్మాణ పనులకు వినియోగించిన ఆవిరి యంత్రం

ధవళేశ్వరం: వేసవి సెలవులను విద్యార్థులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఇప్పటి వరకూ చదువులతో కుస్తీ పట్టిన వారందరూ ప్రస్తుతం ఆటపాటలతో ఉత్సాహంగా గడుపుతున్నారు. ఏడాదంతా పుస్తకాల్లోని పాఠాలు, మార్కులు, ర్యాంకులతో గడిపే వారికి.. బయట ప్రపంచాన్ని చూపించడానికి ఇదే మంచి సమయం. ఆహ్లాదంతో పాటు విజ్ఞానాన్ని అందించేందుకు తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలి. దానికి కాటన్ మ్యూజియాన్ని సందర్శించడం మంచి నిర్ణయం. ఈ విధంగానే ఆలోచించిన పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడకు తీసుకువస్తున్నారు.

పలువురి ఆసక్తి

దూర ప్రాంతాల నుంచి వచ్చే బంధువులు, పిల్లలతో కలిసి కాటన్ మ్యూజియాన్ని సందర్శించేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల ప్రజలు, చిన్నారులతో గత 20 రోజులుగా కాటన్ మ్యూజియం కిటకిటలాడుతోంది. విజ్ఞానంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతోంది. గోదావరి సోయగాల నడుమ నిర్మించిన ఈ మ్యూజియం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కాటన్ మహాశయుని జీవిత విశేషాలతో పాటు గోదావరి పుట్టుక నుంచి సముద్రంలోకి ప్రవేశించే వరకూ సమగ్ర వివరాలు ఇక్కడ పొందుపర్చారు.

విజ్ఞానంతో పాటు వినోదం

కాటన్ మ్యూజియం విజ్ఞానర వరప్రదాయినిగా విరాజిల్లుతోంది. దీన్ని సందర్శించిన వారికి గోదావరి ప్రవహించిన తీరుపై సమగ్రంగా అవగాహన కలుగుతోంది. అలాగే బ్యారేజీ నిర్మించినప్పటి పరిస్థితులను అక్కడి చిత్రాల్లో చూడవచ్చు. మ్యూజియం ఆవరణలో గోదావరి పుట్టిన నాసిక్ నుంచి సముద్రంలో కలిసి పోయే వరకు నమూనాను ఏర్పాటు చేశారు. దాని ఉప నదులు ఎక్కడ కలుస్తాయి. నది పక్కనే ఉన్న దేవాలయాలతో ఈ నమూనాను ఏర్పాటు చేశారు. డెల్టా నమూనాలతో పాటు కాటన్ జీవిత చరిత్రను సమగ్రంగా అందుబాటులో ఉంచారు.

365 రోజులూ తెరిచే ఉంటుంది

కాటన్ మ్యూజియం 365 రోజులు తెరిచే ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకూ సందర్శించవచ్చు. మ్యూజియం లోపల ఫోటోలు తీసుకునేందుకు అధికారుల అనుమతి తీసుకోవాలి.

కళ్ల ముందే చరిత్ర

కాటన్ ఆనకట్ట నిర్మాణానికి ముందు ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను కళ్లకు కట్టినట్లు ఉండేలా ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేశారు. 1986 వరదలలో ఈ ప్రాంత పరిస్థితిని వివరించే ఫొటోలను సైతం ఉంచారు. మరో వైపు ఆనకట్ట నిర్మాణ సమయంలో ఉపయోగించిన పరికరాలను ఉంచారు. వాటి పేర్లను వాటిని అప్పట్లో దేని కోసం వినియోగించారో ఆ వివరాలను అక్కడ పొందుపరిచారు. అదే విధంగా కాటన్ బ్యారేజీ పక్కనే ఏర్పాటు చేసిన ఈ మ్యూజియంలోని పార్కు ఆహ్లాదాన్ని సైతం పంచుతోంది. ఆ పచ్చని గార్డెన్ చిన్నారులను, సందర్శకుల విశేషంగా ఆకట్టుకుంటుంది.

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ



రాజమహేంద్రవరంలో యాత్రలో పాల్గొన్న ప్రజలు

రాజమహేంద్రవరం సిటీ: పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో మన సైనికులు చేసి దాడి అభినందనీయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. భారత సైనిక శక్తిని ఆయన కొనియాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రస్థావరాలపై దాడి జరిపి దేశ ప్రతిష్ఠను నిలబెట్టారని కొనియాడారు. ఈ ర్యాలీ పుష్కరఘాట్ వద్ద ప్రారంభమైన కోటగుమ్మం సెంటర్, మెయిన్ రోడ్డు మీదుగా కోటిపల్లి బస్టాండ్ వరకూ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన భారత సైన్యానికి మద్దతుగా ధవళేశ్వరంలో తిరంగా యాత్ర నిర్వహించారు. టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ధవళేశ్వరం బస్టాండ్ సెంటర్ నుంచి కాటన్ బ్యారేజ్ సెంటర్ వరకు యాత్ర సాగింది.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల వృద్ధి

- కమిషనర్ కేతన్ గార్గ్
- అభివృద్ధి పనుల పరిశీలన



రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: ఇంకుడుగుంతలతో వర్షపు నీటిని సంరక్షిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న ఇంకుడు గుంతలను శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నీటి ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఆహార భద్రతకు భరోసా కల్పించడంలో భూగర్భ జలాలదే కీలకపాత్ర అన్నారు. రాజమహేంద్రవరం నగరంతో పాటు చుట్టూ ఉన్న మరో పది పంచాయతీల్లో 6,560 ఇంకుడు గుంతలను ఇప్పటికే నిర్మించుకున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ వాన నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఈఈ మాధవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా రిఫర్ ఫ్రంట్ ప్రాజెక్ట్

రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుని, అభివృద్ధి పనులు చేస్తున్నట్టు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. దీనిలో భాగంగా గోదావరి ఘాట్ వద్ద జరుగుతున్న పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పీవీ నరసింహరావు పార్కు, గౌతమీ నందనం పార్కు మధ్య ఓ కనెక్టింగ్ బ్రిడ్జి నిర్మిస్తామని, బ్రాహ్మణులు పిండప్రదానాలు నిర్వహించే షెడ్డును మార్చాల్సి ఉందన్నారు. ప్రజలకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా మార్కండేయ ఘాట్ వద్ద ఓ స్థలాన్ని పరిశీలించామన్నారు. దాన్ని తీసుకునేందుకుగానూ నీటిపారుదల శాఖకు లేఖ రాయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే మార్కండేయ ఘాట్ వద్ద పిండ ప్రదానాలకు ప్రస్తుతం ఉన్న షెడ్డుకు నూతనంగా రంగులు వేసి, లైటింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆవలో 100 అడుగుల రోడ్డును ఎండ్ టూ ఎండ్ తరహాలో అభివృద్ధి పరచడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఈఈ మదార్ష అలీ షేక్, ఇతర అధికారులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు ముందుకు రావాలని కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజు రోజుకూ ఎండలు పెరిగిపోతుండటంతో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దాతలు కూడా ప్రజలు అధికంగా సంచరించే బస్టాప్, మార్కెట్లు, ఆసుపత్రులు తదితర ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

23 సినిమాకు విశేష ఆదరణ

- డైరెక్టర్ రాజ్ రాచకొండ
- రాజమహేంద్రవరానికి చిత్ర యూనిట్ రాక
- హీరో తేజ, హీరోయిన్ తన్మయ సందడి



విలేకరులతో మాట్లాడుతున్న డైరెక్టర్ రాజ్ రాచకొండ, చిత్రంలో హీరో హీరోయిన్లు తేజ, తన్మయ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మూడు కీలక ఘటనలను ప్రస్తావిస్తూ, ఆ కేసులు ఎలా ముగిసాయనే అనే అంశాన్ని హైలెట్ చేస్తూ తీసిన 23 (ఇరవై మూడు) సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని దర్శకుడు రాజ్ రాచకొండ చెప్పారు. స్పిరిట్ మీడియా నిర్మాణంలో తేజ రావిపాటి, తన్మయ, ఝాన్సీ కీలక పాత్రలలో నటించిన ఆ చిత్రం నగరంలోని రంభ థియేటర్‌లో ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఆట సమయంలో చిత్ర యూనిట్ విచ్చేసి, ప్రేక్షకులను పలకరించింది. ముందుగా డప్పు వాయిద్యాల నడుమ సురేష్ మూవీస్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పీ స్వాగతం పలికారు. చిత్ర యూనిట్‌ను మాజీ కార్పొరేటర్ పరిమి వాసు పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డైరెక్టర్ రాజ్ రాచకొండ మాట్లాడుతూ గతంలో తాను డైరెక్ట్ చేసిన మల్లేశం, 8 ఏఎం మెట్రో చిత్రాలకు మంచి ఆదరణ లభించిందన్నారు. 1991లో గుంటూరు జిల్లా చుండూరు మారణకాండ ఘటన, 1993లో చిలకలూరిపేటలో బస్సు దహనం, 1997లో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో కారు బాంబు ఘటనల నేపథ్యంలో 23 చిత్రాన్ని రూపొందించామన్నారు. హీరో తేజ రావిపాటి, హీరోయిన్ తన్మయి మాట్లాడారు.

మంచి అలవాట్లతో రక్తపోటు నియంత్రణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు
- ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ర్యాలీ

రాజమహేంద్రవరం రూరల్: ఆరోగ్యకరమైన అలవాట్లతో రక్తపోటును నియంత్రించవచ్చని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శనివారం బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మారుతున్న జీవన శైలితో యుక్త వయసులోనే చాలామంది అధిక రక్తపోటు బారిన పడుతున్నారన్నారు. ప్రజలు తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకుని, జీవన విధానాన్ని ఆరోగ్యకరంగా ఉంచుకోవాలన్నారు. దీని బారిన పడిన వారు పీహెచ్‌సీలలోని వైద్యులను సంప్రదించి మందులు వాడాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్లకార్డులతో నినాదాలు చేశారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలతో సమావేశాలు, చిన్న చిన్న స్కిట్లు ప్రదర్శించి గ్రామాల్లో నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

హెచ్‌ఐవీపై కళాజాత

సీటీఆర్‌ఐ: హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌లపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని చేంజస్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.పుష్పకుమారి అన్నారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, చేంజస్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలో కళాజాత నిర్వహిస్తున్నారు. వీధి నాటకాల ద్వారా ప్రజల్లో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులపై వివక్షత, చిన్న చూపు లేకుండా వారిని మనలో ఒకరిగా జీవించే అవకాశం కల్పించాలన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

ప్రకాశం నగర్: సమాజ సేవలో భాగస్వాములు కావడమే అసోసియేషన్ల ధ్యేయమని ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యాం అన్నారు. ఆ కళాశాలలో జరుగుతున్న వేసవి క్రీడా శిక్షణ తరగతులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో వీరేశలింగం గ్రౌండ్ యూజర్స్ అసోసియేషన్ ప్రారంభిస్తామన్నారు. కళాశాల మైదానాన్ని ఉపయోగించుకున్న ప్రతి ఒక్కరూ దీనిలో సభ్యులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల స్పోర్ట్స్ విభాగ అధిపతి పీఏ కిషోర్ బాబు, మాజీ ప్రిన్సిపాల్ పసుపులేటి శ్రీరామమూర్తి, ఫుట్‌బాల్ కోచ్ సిరా గంగాధర్, సంజీవరావు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో చిన్నారులకు ఏకాగ్రత



ఇన్నీసుపేటలో విద్యార్థులతో నీతి పద్యాలు చదివిస్తున్న శ్రీకాంత్



కడియంలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న చిన్నారులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పుస్తక పఠనంతో చిన్నారులు ఏకాగ్రత పెరుగుతుందని, మంచి విషయాలు తెలుసుకునే అవకాశం కలుగుతుందని ఉపాధ్యాయుడు బోడెల నాగ వెంకట శ్రీకాంత్ అన్నారు. ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు నీతిపద్యాలు, వాటి భావాలు, ఏకాక్షర పద విన్యాస కంద పద్యం గురించి ఆయన వివరించారు. స్పోకెన్ ఇంగ్లిష, హ్యాండ్ క్రాఫ్ట్, లలిత సంగీతం, భగవద్గీత తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుబ్రహ్మణ్యం, మతల రమేష్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కడియం: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రంథాలయ సభ్యుడు భాస్కరరావు, లైబ్రేరియన్ శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం గురించి వివరించారు. నీరు–మీరు అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సరదా కథలతో చిన్నారుల ఆకట్టుకున్నారు. విద్యార్థులతో పుస్తక సమీక్ష చేయించారు. రిసోర్స్‌పర్సన్ రెడ్డి వెంకటరావు స్పోకెన్ ఇంగ్లిషు తరగతులు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న దివాన్ చెరువు నరస చెరువు ప్రాంతానికి చెందిన ఆకుల గోవిందరావు (50) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. ఆకుల గోవిందరావు తన భార్యతో గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి కుమారుడు ఆకుల రమణ ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై మురళీ మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కల సంరక్షణ సమష్టి బాధ్యత

- ఎమ్మెల్సీ సోము వీర్రాజు
- ఉత్సాహంగా హీట్ ద బీట్ కార్యక్రమం



రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు, చిత్రంలో అధికారులు



జేగురుపాడులో ఉపాధి కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ స్టాలిన్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భావితరాలకు ఆరోగ్యకర వాతావరణాన్ని అందించే లక్ష్యంలో భాగంగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్సీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా 16వ డివిజన్ వాంబే కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో శనివారం బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సోము వీర్రాజుతో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, కమిషనర్ కేతన్‌గార్గ్ పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ ఎండల తీవ్రత నేపథ్యంలో ఆరోగ్యం విషయంలో ప్రజలు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే 40 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనంతరం ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వరరావు, సెక్రటరీ శైలాజావల్లి, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ వినూత్న తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ, తాగునీరు పంపిణీ

సీటీఆర్ఐ: అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఉపశమనం కలిగించడానికి మజ్జిగ, తాగునీటి బాటిళ్లను ఉచితంగా పంపిణీ చేసినట్టు ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ కుమారి అన్నారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు కళాశాల బయట బీట్ ది హీట్ అనే కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎం.కాస్మా, ప్రసన్న, వై.సుధారాణి, రవీంద్రనాథ్ టాగూర్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతపై అవగాహన

కంబాలచెరువు: ఎండ తీవ్రత నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటికి రావద్దని, ఒకవేళ వస్తే తలకు హెల్మెట్, టోపీ ధరించాలన్నారు. సరైన మోతాదులో నీరు తాగడంతో పాటు ప్రభుత్వం సూచించిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను వాడాలన్నారు. అనంతరం విద్యార్థులు వేడిని తట్టుకోవడంపై పోస్టర్ ప్రదర్శనలో పాల్గొన్నారు. రెడ్ క్రాస్ విద్యార్థులు చేతుల శుభ్రతపై తోటి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జి.రవితేజ, ఎస్‌ఏఎస్‌ఏ సమన్వయకర్త శ్రీరామూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఈసూబా బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో జాగ్రత్త అవసరం

కడియం: ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్త పడాలని వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జేగురుపాడులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యదర్శి అయినవెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధి కార్మికులకు ఎండ తీవ్రతకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తగినంత మంచినీరు, మజ్జిగ తదితర ద్రవ పదార్థాలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురైతే వెంటనే వైద్య సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల సుధాకర్, పంచాయతీ సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు నాగేంద్రకుమార్, కీర్తిలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో..

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో హీట్ ద బీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. మొక్కలు నాటారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె.సంధ్య, డీపీఎంఓ డాక్టర్ శ్రీవల్లీ, జిల్లా ఎపిడిమాలజిస్ట్ బి.సుధీర్ బాబు, డిప్యూటీ డెమో ఎన్.సత్యకుమార్, సీహెచ్‌వో కె.శర్మ పాల్గొన్నారు.